క్లుప్తంగా

గురుకులంలో పట్టాల పంపిణీ



న్యూశాయంపేట: రంగశాయిపేట శివారు జక్కలొద్ది మైనార్టీ బాలుర గురుకులంలో 5వ నుంచి 9వ తరగతి విద్యార్థులకు కాన్వకేషన్ పట్టాలను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎల్సీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ భిక్షపతి, ఉపాధ్యాయులు రమేష్, మల్లేశం, కౌన్సిలర్ సర్వర్ మొహియొద్దీన్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

వరంగల్ స్పోర్ట్స్ : జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరాల దరఖాస్తు గడువు గురువారం ముగియనున్నట్లు డీవైఎస్ఓ గుగులోత్ అశోక్కుమార్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జేఎన్ఎస్లో ఆధార్, స్టడీ సర్టిఫికెట్లను అందజేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9441086556, 9010002889, 9392015280 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

25న శ్రీథమ్ -2024

హన్మకొండ: హసన్పర్తి మండలం అనంతసాగర్లోని సుమతి రెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 25, 26వ తేదీల్లో శ్రీథమ్ -2024 నిర్వహించనున్నట్లు కార్యక్రమ కో ఆర్డినేటర్ పుష్పలత తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 25న సంప్రదాయ దినోత్సవం, 26న ప్రొనైట్ వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా శ్రీథమ్ వాల్పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఎం.రంజిత్ కుమార్, జె.వేదిక, వేణుగోపాల స్వామి, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు జె.స్వాతి, డి.మాధురి, పి.రమ్యశ్రీ, ఎ.స్వాతి పాల్గొన్నారు.

27న జనరల్ కౌన్సిల్

కేయూ క్యాంపస్: ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్యూ) రాష్ట్ర స్థాయి జనరల్ కౌన్సిల్ను ఈనెల 27న భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించనున్నట్లు పీడీఎస్యూ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు మహేష్ తెలిపారు. ఈమేరకు హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కౌన్సిల్ను సంబంధించిన వాల్పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. బాధ్యులు పవన్, బన్నీ, రాజశేఖర్, అభి భాస్కర్, క్రాంతి, సురేష్ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్లో ఉచిత శిక్షణ

కాజీపేట: వేసవి సెలవులను పురస్కరించుకుని బాలబాలికలకు మార్షల్ ఆర్ట్స్లో కాజీపేట పట్టణంలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు మాస్టర్ కుమార్ తెలిపారు. వ్యాయామ చిట్కాలు, ఆత్మరక్షణకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు హాజరై ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారని వివరించారు.

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్

వరంగల్: 3వ డివిజన్ పైడిపెల్లి గ్రామానికి చెందిన బొల్లం విజయకుమార్ వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసేందుకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈమేరకు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు బుధవారం అందజేశారు.

గంగపుత్ర సంఘం నూతన కమిటీ సరైందికాదు

కాజీపేట రూరల్: ఇటీవల నియమించిన గంగపుత్ర సంఘం నగర కమిటీ సరైందికాదని కాజీపేట గంగపుత్ర (బెస్త) సంఘం కమిటీ సభ్యులు కొదిరిపాక వేదప్రకాష్, అనుమాల శ్రీనివాస్, డి.శంకర్, బి.రవీందర్ తెలిపారు. రైల్వే ఇన్స్టిట్యూట్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సారంగపాణి, రఘు, వేణుగోపాల్, రాజ్కుమార్, సాంబమూర్తి, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

హన్మకొండ: బీఆర్ఎస్కు చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్కు చెందిన కాజీపేట మండల రైతుబంధు కో ఆర్డినేటర్ కంకనాల సంపత్తో పాటు పలువురు నాయకులకు బీజేపీ వరంగల్ లోక్సభ అభ్యర్థి అరూరి రమేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మరావు, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవి, రావు పద్మ, వర్ధన్నపేట అసెంబ్లీ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు జలగం అనిత, రంజిత్, అభినవ్ భాస్కర్ పాల్గొన్నారు.

'పరిపక్వత లేని భాష'

హన్మకొండ: మడికొండ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి అజ్ఞానంతో, పరిపక్వతలేని భాషతో మాట్లాడారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విమర్శించారు. కనీస అవగాహన లేని వ్యక్తి ముఖ్యమంత్రి కావడం తెలంగాణ ప్రజల శోచనీయమని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోదీని విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదని ఆమె తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హనుమకొండ జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒక ఒకేషనల్ కళాశాల తప్పితే మిగితా కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం అంతంత మాత్రంగానే రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్) జనరల్ విభాగంలో 18.13, ప్రభుత్వ పింగిళి ఉమెన్స్ కళాశాలలో 35.1, కమలాపూర్ కళాశాలలో 33.33, హసన్పర్తి కళాశాలలో 29.87, ధర్మసాగర్లో 34.97, ఆత్మకూరు కళాశాలలో 37.5, పరకాల కళాశాలలో 4శాతం, శాయంపేట కళాశాలలో 12.5, హనుమకొండలోని ఒకేషనల్ కళాశాలలో 60.42 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆయా 9 కళాశాలల్లో ఇంటర్ జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో 1714 మందికి 603మంది ఉత్తీర్ణత సాధించారు.

సెకండియర్ జనరల్లో 32శాతమే..

జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ సెకండియర్ జనరల్ విభాగంలో 32శాతం, ఆయా కళాశాలల్లోని ఒకేషనల్ కోర్సుల్లో 72శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఆయా కళాశాలలో జనరల్, ఒకేషనల్ కలిపి 1969 మందికి 874 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 28.53శాతం, పరకాల కళాశాలలో 12.5శాతం, శాయంపేట కళాశాలలో 26.32శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

గిరిజన సంక్షేమ కళాశాల విద్యార్థులలో..

రామన్నపేట: ఇంటర్మీడియట్ ఫలితాల్లో నగరంలోని పెద్దమ్మగడ్డలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నందమూరి పద్మిని తెలిపారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో బి.లోకేశ్వరి (980 మార్కులు), కె.మంజుల (979), ఎ.శ్రీనిధి (979), ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో కె.అక్షిత (985), డి.స్వప్న (984), బైపీసీ మొదటి సంవత్సరంలో బి.శృతిక (438), వై.యశస్విని (437), వి.కళ్యాణి (437), ఎంపీసీ మొదటి సంవత్సరంలో బి.ప్రగతి (467), ఎస్.అరుణ, డి.నాగేశ్వరి, వి.వాసవి 466 మార్కులు సాధించినట్లు వివరించారు. ఆ విద్యార్థులను ఆర్సీఓ డీఎస్ వెంకన్న, ప్రిన్సిపాల్ పద్మిని, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మడికొండ గురుకుల విద్యార్థుల సత్తా

మడికొండ: మడికొండలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో 100శాతం ఉత్తీర్ణత ఫలితాలు వచ్చినట్లు ప్రిన్సిపాల్ ఎస్.మల్లారెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 78 మంది విద్యార్థులకు 77మంది ఏ గ్రేడ్, రెండవ సంవత్సరంలో 75మందికి 69మంది ఏ గ్రేడ్ సాధించారని పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో నిత్యశ్రీ 470 మార్కులకు 466 మార్కులు, బైపీసీలో జె.ప్రణీత 440 మార్కులకు 436 మార్కులు, కే.మధుప్రియ 440కు 436 మార్కులు సాధించినట్లు వివరించారు. రెండవ సంవత్సరం ఎంపీసీలో ఎం.రక్షిత 1000 మార్కులకు 990, ఎస్.పూజిత 986 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.విద్యారాణి, మడికొండ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ మల్లారెడ్డి, కళాశాల సిబ్బంది అభినందించారు.



మడికొండ: విద్యార్థినులను అభినందిస్తున్న గురుకుల కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

హసన్పర్తి కళాశాల విద్యార్థుల విజయం

హసన్పర్తి: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో జి.శ్రీవరధన్ (971 మార్కులు), కె.సుచరణ్ (971), మయూరి (947), వైష్ణవి (919) సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో విష్ణువర్ధన్ (462), విశ్వశ్రీ (426), బీపీసీ విభాగంలో శివచరిత (433), సీఈసీ విభాగంలో సుష్మిత 453 మార్కులు సాధించినట్లు వివరించారు.

కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో హసన్పర్తిలోని కస్తూర్బా గాంధీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఇంటర్ ఎంపీహెచ్డబ్ల్యూ విభాగంలో ఎం.శ్రావణి 968 మార్కులు, జూనియర్ ఇంటర్ ఎంపీహెచ్డబ్ల్యూ విభాగంలో ఎల్. హరిప్రియ 480మార్కులు సాధించినట్లు స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు.



శ్రావణి

గురుకుల విద్యార్థినుల హవా

హసన్పర్తి: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో తెలంగాణ బాలికల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కబనరిచారు. జూనియర్ ఇంటర్లో 140మంది విద్యార్థినులకు 125 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎస్.అంజలి (466 మార్కులు), సీహెచ్.గౌతమి (466), కె.హాసికారెడ్డి (466), బి.శ్రావణి 466 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్లో ఎంపీసీ విభాగంలో కె.సాయిప్రసన్న (990), బీపీసీ విభాగంలో జి.ఇందిర (983), ఎంఈసీ విభాగంలో పీ.అంజలి 965 మార్కులు సాధించినట్లు వివరించారు.



సాయిప్రసన్న

ఖిలా వరంగల్, రంగశాయిపేట కళాశాలల్లో..

ఖిలా వరంగల్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో ఖిలా వరంగల్, రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మోస్తరు ఫలితాలు వచ్చాయి. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరంలో 111 మంది పరీక్షలకు హాజరుకాగా.. 23 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో వీ.కార్తికేయ 424 మార్కులు, ఏ.సాగర్ 388, బైపీసీలో అంజూమ్ 418, మైమునా ముబీనా 396, సీఈసీలో హెచ్.అభిషేక్ 341, సుశ్మంత్ 340, హెచ్ఈసీలో సుమీరాబీ 366 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలో 50 మంది విద్యార్థులకు 20 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో డి.సాత్విక్ 895, ఠాగోరే 817, బైపీసీలో ఇన్షా రుహీజరా 850, బి.శ్రీకర్ 839, సీఈసీలో బి.శివమణి 803, నిఖత్ సుల్తానా 785 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు.

సత్తా చాటిన కేజీబీవీ, మోడల్ కళాశాలలు

ఇంటర్ ఫలితాల్లో ఏడు కేజీబీవీ కళాశాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 222మంది విద్యార్థులకు 130 మంది విద్యార్థులు, ఇంటర్ సెకండ్ ఇయర్లో 212 మందికి 177 మంది ఉత్తీర్ణత సాధించారు.

జిల్లాలో మోడల్ కళాశాలలో..

వరంగల్ జిల్లాలోని ఆరు మోడల్ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం 508మంది విద్యార్థులకు 273 మంది, ద్వితీయ సంవత్సరంలో 590 మందికి 394మంది ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వారిని అభినందించినట్లు పేర్కొన్నారు.

'ధృవ' విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

వరంగల్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో వరంగల్ ఎల్బీనగర్లోని ధృవ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థల ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఆకుల శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ ఆకుల సంపత్, సతీష్ కుమార్ తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 470మార్కులకు ఆకుల ప్రణ్యశ్రీ(465), గొడిశాల హన్సిక(465), తంగపండి ఉదయ(465), చిగురు నూతన(463), శ్రీపాద అనుష్క(463), అఫ్రా మహీన్(461), దుబాసి అభిరాం(460), పోశాల సూర్య 460 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో 440మార్కులకు జువేరియా ఫాతిమా(435), భూక్యా సింధు(434), ఉమె జియా హఫ్సా (431), సీఈసీ విభాగంలో 500మార్కులకు టస్కీన్(489), ఆసిఫియా జీషాన్(488), ఆఫ్రా సుల్తానా(486), చిలువేరు అఖిల 486 మార్కులు సాధించారని తెలిపారు.

సెకండియర్ ఫలితాల్లో..

ఎంపీసీ విభాగంలో వేముల సౌమ్య(986)మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిందన్నారు. అదే విధంగా ఎంపీసీలో పరుపాటి శ్రీనిధి(976), బైపీసీ విభాగంలో జువేరియా ఆయిమేనా (976), సీఈసీ విభాగంలో రిష్మానాజ్ 968 మార్కులు సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

'ఆర్డీ' విద్యార్థుల జయకేతనం

హన్మకొండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో హనుమకొండలోని ఆర్డీ జూనియర్ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగరవేశారని కళాశాల యాజమాన్యం కోడూరి రామ్మూర్తి, బండి మల్లేశం తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బీపీసీలో పి.అరవింద్ 988, పి.సింధు 985 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో పి.సింధూజ 466, జి.సునందత 466, బీపీసీలో జి.స్ఫూర్తి 436, ఇ.యశ్వంత 436 మార్కులు సాధించారని తెలిపారు. సెకండియర్లో 10 మంది విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించారని, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 11 మంది విద్యార్థులు 460, ఎంపీసీలో 10మంది విద్యార్థులు 430కి పైగా మార్కులకు పైగా సాధించారని వివరించారు. ఈ సందర్భంగా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను లెక్చరర్లు, సిబ్బంది, తదితరులు అభినందించారు.



పి.అరవింద్ పి.సింధు పి.సింధూజ
జి.సునందత జి.స్ఫూర్తి ఈ.యశ్వంత

రాష్ట్ర స్థాయి మార్కులతో రెజోనెన్స్ హవా



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న రెజోనెన్స్ యాజమాన్యం

హన్మకొండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో హనుమకొండలోని రెజోనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులతో తమ హవా కొనసాగించారని కళాశాల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు బత్తుల వెంకట్ జశ్వంత్, తాటికొండ చందన, ముంద్రు కారుణ్య, వేసులపల్లి అన్వేష్ 468 మార్కులు సాధించారని, బీపీసీలో దేవరకొండ త్రిలోచని, నిధా ఫర్వీన్ 437 మార్కులు సాధించారని వివరించారు. ద్వితీయ సంవత్సరం బీపీసీలో కొండపాక చంద్రహాసిని 992, ఎంపీసీలో గుంటి సంజయిని 989, ఎస్.కృష్ణచైతన్య 988 మార్కులు సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 180 మంది విద్యార్థులు 460 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో వేయి మంది విద్యార్థులు 992, 139 మంది 950 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఆ విద్యార్థులను కళాశాలలో చైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సీఏఓ రమ్య, అకడమిక్ డీన్ బి.ఎస్.గోపాల్ రావు, డీన్ సాంబశివుడు అభినందించారు.

ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక చర్యలు





వీసీలో పాల్గొన్న హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, అధికారులు

హన్మకొండ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్రాజ్ ఆదేశించారు. ఎన్నికల నామినేషన్ల స్క్రూటినీ, బ్యాలెట్ పేపర్ ముద్రణ, హోం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి ఈనెల 26 నాటికి తుది ఓటరు జాబితా రూపొందించాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, వెంకట్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్ఓ వైవీ.గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు వెంకటేష్, నారాయణ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

వరంగల్: వరంగల్ నుంచి వీసీలో కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏఆర్ఓలు దత్తు, కృష్ణవేణి, నోడల్ అధికారులు కౌసల్యాదేవి, రామిరెడ్డి, సంజీవరెడ్డి, సత్యవాణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయొచ్చు..

వరంగల్ (ఎస్సీ) పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సాధారణ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'గ్రావిటీ' విజయదుందుభి

హన్మకొండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో హనుమకొండలోని గ్రావిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఐదుగురు విద్యార్థులు చిట్టి సౌమ్యశ్రీ, మేడిపల్లి నందిని, ఓదెల కీర్తన, కొత్తపల్లి ఉష, ఆకుల స్ఫూర్తి 466 మార్కులు సాధించారని, మరో 15 మంది విద్యార్థులు 460 మార్కులు సాధించారని పేర్కొంది. బీపీసీ విభాగంలో గుగులోతు రాజేష్ నాయక్ 436, గుగులోతు హస్సిక 434, మొలుగూరి హాసిని 434, నందికొండ హంసితరెడ్డి 433, తాటి జీవనలక్ష్మి 433, మండల శ్రావ్య 431 మార్కులు సాధించారని యాజమాన్యం తెలిపింది.

'రామప్ప' విద్యార్థుల సత్తా

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో బస్టాండ్ సమీపంలోని రామప్ప జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ ఐలి కరుణాకర్ గౌడ్ తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరంలో గోనె సాత్విక (435 మార్కులు), మాసం మనోజ్ఞ, ఆకుల మిన్ను (429), ఎంపీసీలో బైరా అక్షరశ్రీ, బైరోజు వైష్ణవి (463), బి.స్నేహ (460), రెండవ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బొల్లం రిషిక (985) సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

విజన్ కళాశాల విద్యార్థుల విజయం

హన్మకొండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో హనుమకొండలోని విజన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఎల్.నవనీత రావు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఎల్.సంజీవరావు 987 మార్కులు, ఎల్.నిఖిల్ 984, కె.విష్ణువర్ధన్ 983, బీపీసీలో ఎస్.సాత్విక 972, డి.ప్రవీణ్ 970, ఎల్.అపర్ణ 979, కె.మన్విత్ రెడ్డి 978, ఇ.వెన్నల 978, ఎ.మాన్విక 975, ఎల్.హరికృష్ణ 974, భానుతేజ 972 మార్కులు సాధించారని వివరించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో బి.వైష్ణవి 466, బి.శ్రీరాజ్ 466, జి.ఆదిత్య 466, ఎ.శ్లోక 465, వి.విశ్వతేజ 463, పి.శ్నీతిక 462, జి.అశ్విత 461, కె.వినూత్న 459, ఎ.సాయి 459, బీపీసీలో మాసినా అబ్రార్ 429, నైలా కౌసర్ 427 మార్కులు సాధించారని వివరించారు. వారిని కళాశాల కరస్పాండెంట్ నవనీత్ రావు, డైరెక్టర్ ప్రదీప్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న విజన్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఎల్.నవనీతరావు

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి



మాట్లాడుతున్న అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని ఏఆర్ఓ, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఎన్నికల నోడల్ అధికారులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ లోక్సభ ఎన్నికల దృష్ట్యా బల్దియా ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నంబర్ 9701999645ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎన్నికల నోడల్ అధికారులు అజిత్ రెడ్డి, విజయలక్ష్మి, రవికుమార్, మానస, సూపరింటెండెంట్ సంతోష్, ఎన్నికల డీటీ సుభాన్ పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలి

నిబంధనల ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీవాకడే అన్నారు. భవన నిర్మాణాల అనుమతుల మంజూరు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల అందించేందుకు పలువురు నగరవాసులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో కమిషనర్ బుధవారం పర్యటించారు.

బీఎస్ఎన్ఎల్ భవన్లోకి ఇన్కం ట్యాక్స్ కార్యాలయం

వరంగల్: వినియోగదారుల సౌకర్యార్థం కేఎంసీ పక్కన ఉన్న బీఎస్ఎన్ఎల్ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్లో వరంగల్ ఇన్కం ట్యాక్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఇన్కం ట్యాక్స్ చీఫ్ కమిషనర్ మిథాలీ మధుస్మిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ కార్యాలయం మే15వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్కం ట్యాక్స్ అధికారులు బి.వెంకేశ్వర్రావు, వెంకన్న తేజావత్, గుగులోత్ చక్రధరి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

హన్మకొండ అర్బన్ : లోక్సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి బీఎల్వోలు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ ఎ.వెంకట్రెడ్డి అన్నారు. కలెక్టరేట్లో పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని బీఎల్ఓలకు ఓటరు స్లిప్పుల పంపిణీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 8 వరకు ఓటర్లకు స్లిప్పులు అందించాలని సూచించారు. అనంతరం బీఎల్ఓలకు ఓటరు స్లిప్పులు అందజేశారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఏఆర్వో, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, హనుమకొండ కాజీపేట తహసీల్దార్లు విజయ్కుమార్, భావ్సింగ్, బీఎల్ఓలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల కోసం ఉచిత వైద్య శిబిరం

హన్మకొండ అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వయో వృద్ధులకు సేవలందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణగౌడ్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మొబైల్ మెడికేర్ యూనిట్, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో ఆనంద ఆశ్రమంలో వయోవృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవల ఆరోగ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించినట్లు వివరించారు. శిబిరాన్ని ఆనంద ఆశ్రయ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ ఈటల సమ్మయ్య ప్రారంభించగా, వృద్ధులకు వైద్యులు బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైద్యులు కిషన్రావు, మొహమ్మద్ తహర్ మసూద్, సిబ్బంది శివకుమార్, క్రాంతి, పవన్, నరసింహాచారి, రాజు, ఆనంద ఆశ్రమ ప్రతినిధులు యాదగిరి, ప్రీతి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సంక్షిప్తంగా

'అంగన్వాడీ'లో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే

వరంగల్: ఏనుమాముల సుందరయ్యనగర్లోని అంగన్వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే(ఈసీసీఈ)ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ జక్కుల లావణ్య మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లలకు ఆటపాటలతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో విద్యాబోధన జరుగుతోందని వివరించారు.

షాట్పుట్ విజేతకు సన్మానం

కాజీపేట: సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్లో సీనియర్ సిటిజన్స్ 5వ అథ్లెటిక్స్ ఓపెన్ పోటీల్లో షాట్పుట్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించిన మండలోజు కృష్ణమూర్తిని పలువురు సన్మానించారు. పట్టణంలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులతో కలిసి తెలంగాణ ఆయిల్ అండ్ సీడ్స్ ఫెడరేషన చైర్మన్ జంగా రాఘవరెడ్డి సన్మానించారు. శ్రీనివాస్, ఎండీ.మహబూబ్ ఖాన్, సారంగం, ఎస్డీ.అక్తర్, సుమన్ పాల్గొన్నారు.

'సహృదయ'లో పండ్ల పంపిణీ

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్నగర్ కాలనీలోని సహృదయ అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు హనుమాన్ మాలధారుడు కోరుట్ల రమేష్, స్రవంతి దంపతులు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో వారు ఆత్మీయంగా గడిపిన సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు ఎండీ.యాకుబీ, చోటు పాల్గొన్నారు.

పుర వీధుల్లో కొనసాగుతున్న రథోత్సవం

వరంగల్ చౌరస్తా: గోవిందరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రెండో రోజు రథోత్సవ కార్యక్రమం కొనసాగుతోంది. దుర్గేశ్వర స్వామి ఆలయం, రాధిక థియేటర్ నుంచి పిన్నావారి వీధి, రాముల వారి కోవెల మీదుగా సత్య ఆస్పత్రి వరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు మంగళ హారతులతో ఎదురెగారు. రథోత్సవంలో ఆలయ ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాసా స్వామి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, నాయకులు అనిల్కుమార్, ఆది నారాయణ, క్రాంతి, వేణు, అర్చకులు జగన్నాథం, వేణు స్వామి, కిరణ్ స్వామి, క్రాంతికుమార్, భక్తులు పాల్గొన్నారు.

వంట కార్మికులకు పెంచిన వేతనాలు ఇవ్వాలి

న్యూశాయంపేట: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వంట కార్మికులకు రూ.10 వేల వేతనాన్ని ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అమలు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవిందర్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ బిల్లులు సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి, నాయకులు సారంగపాణి, రాజు, లక్ష్మి, మస్తాన్ బీ, లక్ష్మి, కవిత, విజయ, రాధమ్మ, కల్పన, రాణి, శాంత, ఇందిర పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట పరిధిలోని బెస్తం చెరువు సమీపంలో గంగమ్మ తల్లి, పోతరాజు స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఉత్సవ కమిటీ, గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో వేద పండితుడు పోలోజు భాస్కరాచార్యుల నేతృత్వంలో విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఉదయం కలశ స్థాపన, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, దీక్ష కంకణధారణ, యాగం శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం విగ్రహాలకు జలాధివాసం నిర్వహించారు. భక్తులకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం ప్రతినిధులు బైరి రామేశ్వర్ పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

దేశాయిపేట: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈనెల 24వ తేదీన దేశాయిపేట రోడ్డు కేఆర్గార్డెన్స్లో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామాజిక సమ్మేళనం సదస్సును విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ పిలుపునిచ్చారు. దేశాయిపేట రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సులో బీసీ రాష్ట్ర, జిల్లా కుల సంఘం నాయకులు, బీసీ మేధావులు, కుల సంఘాల పెద్దలు, నాయకులు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో ఓబీసీ మోర్చా నాయకులు బైరి మురళీకృష్ణ, గోరికార్ అనిల్, వెంకటేష్, పోశాల సతీష్, కోమాకుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ టికెట్ల కుంభకోణంపై దర్యాప్తు చేయాలి

ఖిలా వరంగల్: ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల విక్రయాల్లో జరుగుతున్న కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేసి దోషులను శిక్షించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కు సుధీర్ డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్ సీపీఐ తమ్మెర భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ బోర్డు ఆధ్వర్యాన ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ల టికెట్ల అమ్మకంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు వచ్చాయన్నారు. ఏప్రిల్ 25న ఉప్పల్ స్టేడియంలో సన్రైజర్స్ హైదరాబాద్ – రాయల్ చాలెంజర్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో గత శుక్రవారం 36 వేల టికెట్లను అమ్మకానికి పెట్టగా నిమిషాల వ్యవధిలో అయిపోయాయని హెచ్సీఏ బోర్డ్ ప్రకటించిందని గుర్తుచేశారు. అన్ని టికెట్లు నిమిషాల్లోనే ఎలా అమ్ముడుపోతాయని సుధీర్ ప్రశ్నించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు సుమన్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జన జాతరకు తరలిన నాయకులు

కాశిబుగ్గ: హనుమకొండ జిల్లా మడికొండలో బుధవారం నిర్వహించిన ఓరుగల్లు జన జాతరకు నగరంలోని 18, 19, 20, 35వ డివిజన్ల నుంచి కాంగ్రెస్ నాయకులు పలు వాహనాల్లో తరలివెళ్లారు.